క్లుప్తంగా

ఘనంగా మారెమ్మ దేవర



పెనుమాడలో ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

కృష్ణగిరి : మండలంలోని పెనుమాడలో వెలసిన మారెమ్మ అవ్వ దేవత దేవర ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వేకువజాము నుంచే మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవర సందర్భంగా బంధుమిత్రుల రాకతో గ్రామం కిక్కిరిసిపోయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

వీల్ చైర్లు అందజేత



వీల్ చైర్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మద్దికెర : అనంతపురం జిల్లా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు మూడు వీల్ చైర్లు విరాళంగా ఇచ్చినట్లు మద్దికెర బ్రాంచ్ చైర్మన్ వలి తెలిపారు. బుధవారం సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కర్నూలు జిల్లా కోశాధికారి డాక్టర్ రఘునాథ్‌రెడ్డి ఆలయ ఈఓ వాణికి వీల్ చైర్లు అందజేశారు. ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం అందజేసినట్లు వారు చెప్పారు. ఏఈఓ ఓంకారం వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుడు

మద్దికెర : మండల కేంద్రం నుంచి గుంతకల్లుకు వెళ్లే రహదారిలో హెచ్‌పీ పెట్రోల్ బంకు మలుపు వద్ద బుధవారం లారీ బైకును ఢీకొనడంతో అభి, హర్ష తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన గ్రామస్తులు వైద్యం కోసం క్షతగాత్రులను గుంతకల్లుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ పరిసరాలు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



ఏరూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సునీత

చిప్పగిరి: పంట మార్పిడితో అధిక దిగుబడి సాధించడానికి దోహదం చేస్తుందని ఏడీఏ సునీత అన్నారు. బుధవారం మండలంలోని బంటనహాలు, ఏరూరు తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో నూతన విధానాలు, ఆధునిక పనిముట్లు ,యంత్రాల వినియోగం, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో సర్పంచులు సుశీల,వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


అన్నదానానికి విరాళం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప భక్త మండలి సభ్యుల 41 రోజుల అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి రూ.1.50 లక్షల విరాళంగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా భక్త మండలి సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విళక్కి పూజ



పగిడిరాయిలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

తుగ్గలి : మండలంలోని పగిడిరాయిలో బుధవారం అయ్యప్పస్వామి మకరవిళక్కి పూజను మాలధారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి కిరణ్‌స్వామి ఆధ్వర్యంలో మెట్ల పూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో మాలధారులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి స్వామి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌లో ఉంచి వీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప శరణుఘోషలతో వీధులలు మార్మోగాయి.

అన్నదాతను నట్టేట ముంచిన ‘కూటమి’

- రైతుల తరుపున పోరాడేందుకు 13న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ర్యాలీ
- చెరుకులపాడులో పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



చెరుకులపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాట శ్రీదేవి

కృష్ణగిరి(వెల్దుర్తి) : అన్నదాతను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. రైతు సమస్యలపై ఈనెల 13వ తేదీన కర్నూలులో నిర్వహించే ర్యాలీకి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం చెరుకులపాడులో కృష్ణగిరి, వెల్దుర్తి, ఎంపీపీలు కంగాటి రామ్మోహన్ రెడ్డి, రంగన్న, కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరాముడు, నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం కింద రైతులకు ఇస్తామన్న రూ.20వేలు ఆరు నెలలు గడిచినా ఇవ్వలేదని విమర్శించారు. ఖరీఫ్, రబీలో పంట పెట్టుబడుల కోసం రైతులు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేవన్నారు. టమాట కిలో రూపాయికి పడిపోయినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రబీ పంటలకు బీమా ప్రీమియం చెల్లించకుండా రైతులపై భారం మోపిందని గుర్తు చేశారు. ఇలా పలు డిమాండ్లతో ఈ నెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే రైతు ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరావు, శ్రీరామ్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జగన్నాథరెడ్డి, కృష్ణారెడ్డి, కిట్టు, నాగరాజు, జయరాంరెడ్డి, ప్రహ్లాద, మల్లికార్జున పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 40 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. వీటిలో 22 (ఏ) ప్రభుత్వ భూమి కింద నమోదైన అర్జీలు 2, అడంగల్‌లో మార్పులు,చేర్పుల కోసం 5 అర్జీలు వచ్చాయన్నారు. మిగులు భూమిగా ఉన్న భూమిని అడంగల్‌లో తమ పేరుపై మార్పు చేయాలని 33 మంది రైతులు అర్జీలు అందించారన్నారు. వచ్చిన అర్జీలను అప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి రైతులకు రసీదు అందించామన్నారు. స్వీకరించిన అర్జీలకు 45 రోజుల్లోగా పరిష్కారం చేస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ వెల్లడించారు. మండల సర్వేయర్ అరుణ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, వీర్వో అమరేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.

తుగ్గలి : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి సుధాకరరెడ్డి, తహసీల్దార్ రమాదేవి అన్నారు. బుధవారం చెన్నంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై పదిమంది రైతులు అర్జీలు ఇచ్చారు. జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి, ఈవో వీరయ్య, డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు కృష్ణారెడ్డి, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌రంగనాథ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని కై రుప్పల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కై



కైరుప్పలలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇస్తున్న రైతులు

రుప్పల, పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన 14 మంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి దరఖాస్తులు ఇచ్చారు.సర్పంచ్ తిమ్మక్క, వీఆర్‌ఓలు ఈరన్న, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

హొళగుంద: నెరణికి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దారు సతీష్, డీటీ నిజాముద్దీన్, దేవదాయ, ఫారెస్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతులు, గ్రామస్తుల నుంచి అర్జీలు తీసుకున్నారు. 12 అర్జీలు భూ సమస్యలు, 30 అర్జీలు ధ్రువ పత్రాలకు సంబంధించినవి ఉన్నట్లు తహసీల్దారు సతీష్ తెలిపారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బల్లోట, కుర్లేహళ్లి గ్రామాల్లో బుధవారం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, సర్పంచ్ మోకా సిద్ధమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

సంక్షిప్తం

అధిక ధరలను అరికట్టాలి

తుగ్గలి : అధిక ధరలు, నిరుద్యోగాన్ని అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, మండల కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఒక్క రూపాయి కూడా కరెంటు చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు అవేవీ పట్టించుకోకుండా ప్రజలపై విద్యుత్ భారం మోపేందుకు సిద్ధమయ్యారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు నియంత్రించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు నరసింహులు, జయరాముడు, కార్యదర్శులు వీరయ్య, సూరారెడ్డి, బాబాఫక్రుద్దీన్, నాగేష్ పాల్గొన్నారు.

13,14 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి : అభివృద్ధి పనులు, మరమ్మతుల దృష్ట్యా ఈనెల 13, 14వ తేదీల్లో తుగ్గలి, జొన్నగిరి సబ్ స్టేషన్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. బోరుబావులకు తెల్లవారుజామున సరఫరా ఇస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాత్‌రూమ్ గోడ కూలి ఇద్దరికి గాయాలు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో బాత్‌రూం గోడ కూలిన ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని తన ఇంట్లో ఎల్లలింగ అనే వ్యక్తి దినసరి కూలీ మల్లయ్యతో కలిసి పాత బాత్‌రూమ్‌ను కూలుస్తున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా గోడ వారిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తీసుకెళ్లారు.

13న రైతు ర్యాలీ

తుగ్గలి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13వ తేదీన కర్నూలులో తలపెట్టిన రైతు ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్ పిలుపునిచ్చారు. రైతు సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం తీరుకు నిరసన తెలిపే ర్యాలీకి పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు. 13న ఉదయం 9గంటలకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వ గృహానికి చేరుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

చిప్పగిరి: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల కేంద్రంలో రూ.60 లక్షతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు బుధవారం పోతురాజు రాముడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలానికి 1.80 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీటీసీ రజిని, నాయకులు గోవిందు,సుంకన్న పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ విద్యుత్ యూనిట్లు



సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఈఈ శేషాద్రి

కృష్ణగిరి : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లు రాయితీపై అందిస్తున్నట్లు ఈఈ శేషాద్రి తెలిపారు. బుధవారం మండలంలోని లక్కసాగరం, కంబాలపాడు, చిట్యాల సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈఈ మాట్లాడుతూ.. సోలార్ యూనిట్ల వల్ల గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లు ఖర్చు మిగులు తుందన్నారు. ఇంటి పైకప్పుపై కనీసం 10చ.మీటర్ల లో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని చెప్పారు. రాయితీ సోలార్ యూనిట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏఈ మద్దిలేటి ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

హొళగుంద: ఈ నెల 14వ తేదీన సాగు నీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు సతీష్, టీబీపీ ఏఈ ఈశ్వర్ ఆయా శాఖల అదికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలో మూడు ఎల్లెల్సీ, రెండు మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాల ఉన్నాయని ఈ సంఘాలకు అధ్యక్షులు, మెంబర్ల ఎన్నికలు నిర్వహిస్తారని చెప్పారు. ఎన్నికలు హొళగుంద, హెబ్బటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేయాని ఆదేశించారు. సమావేశంలో ఏఓ ఆనంద్ లోకదల్, డీటీ నిజాముద్దీన్, పీఆర్, హౌసింగ్ ఏఈలు యమునప్ప, గోపినాథ్ వర్మ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

ఆస్పరి: మండలంలోని వెంగళాయిదొడ్డి, ముత్తుకూరు, చిన్నహోతూరు సాగు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీటీ రామేశ్వర రెడ్డి తెలిపారు. వెంగళాయిదొడ్డి సాగు నీటి సంఘానికి సంబంధించిన ఎన్నికల నోటిఫ్ కేషన్‌ను ఎన్నికల అధికారి హనుమంతు రైతుల సమక్షంలో సచివాలయం గోడకు అతికించారు. వెంగళాయిదొడ్డి సాగు నీటి సంఘం ఎన్నికల్లో 527 మంది, చిన్నహోతూరులో 107 మంది, ముత్తుకూరులో 186 మంది రైతులకు ఓటు హక్కు ఉంది. వెంగళాయిదొడ్డి సాగు నీటి సంఘం ఎన్నికల్లో వెంగళాయిదొడ్డి, కైరుప్పల, చెన్నంపల్లి, కారుమంచి గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. 14వ తేదీన కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్, ముత్తుకూరులో ప్రాథమిక పాఠశాల, చిన్నహోతూరులో 3టీసీలకు ప్రాథమిక పాఠశాల, మరో 3టీసీలకు సచివాలయంలో పోలింగ్ నిర్వహించనున్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సతీష్

నేటి నుంచి సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ

తుగ్గలి : సుస్థిర లక్ష్యాల సాధనపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తుగ్గలి, పత్తికొండ ఎంపీడీఓలు విశ్వమోహన్, సువర్ణలత తెలిపారు. 12, 13 తేదీల్లో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్ 1-5), విలేజ్ సర్వేయర్లు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఒక బ్యాచ్, 17, 18 తేదీల్లో మరో బ్యాచ్‌లో వీఆర్వోలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెల్ఫేర్, ఎనర్జీ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, ఎనర్జీ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణకు సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

దేవనకొండ: ప్రభుత్వ భూములను కాపాడాలని జై భీమ్ యువత ఫౌండేషన్ అధ్యక్షుడు ఆవుల సోమన్న బుధవారం పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వెలమకూరు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని కబ్జాకు గురయ్యిందన్నారు. ఆక్రమణపై విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ మునిస్వామి, నాయకులు టైలర్ రాజు, హాజీ, అవినాష్, సంతోష్ పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులతో సీసీ రోడ్డు

మద్దికెర : స్థానిక కవిరెడ్డి వీధిలో ఎంపీపీ నిధులు రూ.8 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నామని ఎంపీపీ అనిత, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నిర్మాణ పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ ప్రాథమిక పాఠశాల వెనుకనున్న హెల్త్ సెంటర్ నుంచి కవిరెడ్డి వీధి వరకు సీసీ రోడ్డు వేయిస్తామని చెప్పారు.

టమాటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నందమూరి తారకరామరావు కూరగాయల మార్కెట్‌ను ఆ సంఘం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి పండించిన టమాట పంటకు గిట్టుబాటు ధరలేక, వాటిని పారబోసే దుస్థితి నెలకొందన్నారు.కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని కోరారు.

శనగ పంటకు తెగులు

ఆలూరు రూరల్: ఇటీవల ఏర్పడిన తుపాన్ ప్రభావంతో కమ్ముకున్న ముసురు కారణంగా భూమిలో తేమ శాతం ఎక్కువై సాగు చేసిన శనగ పంటకు తెగులు సోకింది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు 36 వేల హెక్టార్లలో శనగ పంట సాగు చేశారు. ఎకరాలకు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. మందుల పిచికారీ కోసం ఇప్పటి వరకు రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. పంట వేసి 2 నెలలు పూర్తయ్యింది. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో పంటకు తెగులు సోకి పూర్తిగా దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి సలహాలు,సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.



తెగులు సోకిన పప్పుశనగ పైరు


పెరవలిలో వేలాలు వాయిదా

మద్దికెర : మండలంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో టెంకాయలు, తమలపాకుల విక్రయం కోసం ఏర్పాటు చేసిన బహిరంగ వేలంపాటలు వాయిదా వేసినట్లు కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో వేలాలు నిర్వహించగా గతేడాది కంటే తక్కువకు పలకడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు వేసేది తెలియజేస్తామని చెప్పారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్: మీడియా ప్రతినిధులపై దాడి చేసిన నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని ఆలూరు ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ప్రజలు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. జర్నలిస్టులు శ్రీధర్,కోటి, సూరి,నాగు,అంజి,డానియల్,గోపాల్,చిన్నా,రామ్మోహన్ ఖాదర్,కన్నా ఉన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



స్వామి దర్శనానికి వెళ్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు

మంత్రాలయం: జిల్లాలో మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆర్. హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అబొడీ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైన్‌షాపుల్లో ఎమ్మార్పీల కంటే ఎక్కువకు విక్రయిస్తే వెంటనే తమ ఫోన్ నెంబర్:9440902268కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించి ఏపీ, కర్ణాటక మద్యంను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ముఖ్యంగా మంత్రాలయం శ్రీమఠం పరిసరాల్లో మద్యం విక్రయిస్తే పీడియాక్ట్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరామునాయుడు ఉన్నారు.

వరిగడ్డికి తగ్గిన డిమాండ్

- దిగుబడి బాగుండడంతో తగ్గిన ధర
- పశువుల యజమానులకు కాస్త ఊరట



వరిగడ్డిని కొని ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో గడ్డికి డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం ఎకర వరిగడ్డి రూ.వెయ్యి నుంచి రూ.1,500 (ట్రాక్టర్ వరిగడ్డి రూ.4వేలు) వరకు పలుకుతోంది. గతేదాది ఒక కారు పంట మాత్రమే రావడంతో రైతులు గడ్డిని అమ్మకుండా తమ పశువుల కోసం నిల్వ ఉంచుకున్నారు. దీంతో ఎకరం వరిగడ్డి రూ.2,500 వరకు పలికింది. దూర ప్రాంతాల వారికి రవాణా ఖర్చుతో కలిపి ట్రాక్టర్ రూ.20 వేల వరకు పడింది. ఈసారి ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా పంట సాగవుతుండడంతో స్థానిక రైతులు రబీలో వచ్చే గడ్డిని నిల్వ ఉంచుకునేందుకు నిర్ణయించుకుని ప్రస్తుతం వచ్చిన గడ్డిని అమ్మేస్తున్నారు. దీనివల్ల కావల్సినంత వరిగడ్డి అందుబాటులో ఉండడం వల్ల ధర తగ్గి పొలాలు లేని పశువుల యజమానులకు కొద్దిగా ఊరట కలిగింది. ప్రస్తుతం మండల పరిధిలోని ఎల్లార్తి, చిన్నహ్యాట, నెరణికి, పెద్దహ్యాట తదితర తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) పరిధిలోకి రాని గ్రామాలతో పాటు ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, పత్తికొండ తదితర దూర మండలాల నుంచి రైతులు, పశువుల యజమానులు గడ్డిని కొని ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. వీరికి ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలు ఖర్చు రాగా, దగ్గరి గ్రామాల వారికి రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు ఖర్చు వస్తుంది. ఏదేమైనా ఈ ఏడాది వరిగడ్డికి కాస్త డిమాండ్ తగ్గింది.



పదోన్నతిపై వెళ్తున్న జడ్జి ఎంఎస్ భారతితో న్యాయవాదులు

న్యాయవాదులు అంకితభావంతో పనిచేయాలి

పత్తికొండ(తుగ్గలి) : న్యాయవాదులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందేలా చూడాలని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఆమె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జడ్జిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. జడ్జి మాట్లాడుతూ.. న్యాయవాదులు రెగ్యులర్‌గా కోర్టుకు హాజరై, కేసుల పట్ల విషయ పరిజ్ఞానం పెంపొందించుకొని కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో తనకు సహకారం అందించిన న్యాయవాదులు, కోర్టు సిబ్బంది జడ్జి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి రాజశేఖరనాయుడు, సహాయ కార్యదర్శి వాసు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

దేవనకొండ: మండలంలోని రైతాంగ, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ, వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మూగితాత దర్గా కమ్యూనిటీ భవనం ఆవరణలో సీపీఎం మండల మహాసభలు పార్టీ నాయకుడు సూరి అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో పంట కాలువల నిర్మాణాలు పూర్తి చేసే వరకు ప్రభుత్వంపై పోరాడతామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చస్తశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. పార్టీ మండల నాయకులు రాఘవరెడ్డి, పరమేశ్, యూసుఫ్ బాషా, మహబూబ్‌బాషా, పరమేష్ పాల్గొన్నారు.

ఉపనిషత్తుల సారం భగవద్గీత



భగవద్గీతతో విద్యార్థులు

కృష్ణగిరి(వెల్దుర్తి) : ఉపనిషత్తుల సారం భగవద్గీత అని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరిసింహనాయుడు అన్నారు. గీతా జయంతి సందర్భంగా బుధవారం వెల్దుర్తి, లద్దగిరి హైస్కూళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన భగవద్గీత గ్రంథాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భగవద్గీతతో లోక కల్యాణం

దేవనకొండ: సర్వమానవ సోదరాభావం, త్యాగనిరతి, విశ్వవ్యాపిత భగవానుడితత్వం తెలియజేసి, లోకకళ్యాణానికి భగవద్గీత ఉపయోగ పడుతుందని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు శ్రీనివాసయాదవ్, ఆకుల భీమేష్ అన్నారు. బుధవారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ భగవద్గీత సారాంశం సర్వమానవాళికి జ్ఞానోదయం కలిగించి సన్మార్గంలో పయనింపజేసి జీవితాన్ని సుఖమయం చేస్తుందన్నారు. కార్యకర్తలు పులికొండ రామాంజనేయులు, కౌలుట్ల, మల్లికార్జునరెడ్డి, రంగప్ప ఆచారి, వెంకప్ప, వీరాచారి, సత్యన్న, ఎల్లప్ప, వీరేష్‌రెడ్డి పాల్గొన్నారు.